# శంకరశాస్త్రి యింట్లో త్రాచుపాము

జి. యస్. సత్యనారాయణ

★

భోంచేస్తూన్న భర్త శంకరశాస్త్రికి మజ్జిగ పోద్దామని, ఉట్టిమీద ఉన్న మజ్జిగకుండ దగ్గరకు పోతూ పోతూ "నాంచారమ్మ" అదిరిపడి, హఠాత్తుగా ఒక్కడుగు వెనక్కి వేసి, "అమ్మ బాబోయ్!" అని రెండు అరిచేతులతోనూ ఒక్కసారి చప్పట్లుమాదిరిగా కొట్టి చచ్చాన్రోయ్! అని కేక పెట్టింది.

ఈ శబ్దంతో ఉట్టికొళ్ళమీద తోక ఎగరేసుకుంటూ ప్రాకుతున్న ఎలుక బెదరి "కీచు; కీచు" మంటూ అటకమీదికి పోయింది.

తింటూ తింటూన్న శంకరశాస్త్రి, గుండె బెదరి, నాంచారమ్మ వేపుకి ఒక్కసారిగా మెడకాయ త్రిప్పి, మందస్వరంతో "ఏమిటే, అదీ!" అని నోరు ఆవులించుకుని అల్లాగే చూస్తూ ఉండి పోయాడు.

దొడ్లో తులసికోటలో నీళ్ళుపోసి, కళ్ళు మూసుకొని సూర్యుడికి నమస్కారం చేస్తూన్న నాంచారమ్మ విధవ పిన్నత్తగారు, త్రుళ్ళిపడి తులసెమ్మకు నైవేద్యం పెట్టిన జామపండు కొట్టుకెళ్ళి పోతాయేమోనన్న ధ్యాసమైనా లేకుండా "ఏమిటేమ్మా! ఏమిటే అదీ!" అంటూ ఆదుర్దాగా లోపలికొచ్చింది.

"ఏముంది అత్తయ్యా! మజ్జిగకుండలో ఏమిటో పొడుగ్గా పడింది" అంది నాంచారమ్మ పొడి గొంతుతో.

"ఈ మాత్రానికేటే ఇంత కేక పెట్టావు! ఏడ్చావులే బల్లి గిల్లి ఏమైనా పడిందేమో! చూడు" అన్నాడు శంకరశాస్త్రి.

నాంచారమ్మకు అయోమయమయింది. కళ్ళు పెద్దవిచేసి చేతులు ఆడిస్తూ, "బల్లేమిటండీ! మీదంతా చిత్రం. నాకేం కళ్ళు లేవనుకున్నారా? అప్పుడే పూడిపోయాయనుకున్నారా? మీకూ నాకూ ఋణానుబంధం ఉంది కాబట్టి యింకా యిప్పుడు మీతో మాట్లాడగలుగుతున్నాను. లేకపోతే ఇందాకనే అయిపోవాల్సింది" అనేసరికి "అసలు సంగతేమో చెప్పవేమే!" అంది ఆదుర్దా పడుతూన్న పిన్నత్తగారు.

"ఏముందండీ! నేను ఉట్టిదగ్గర కెళ్ళేసరికి తెల్ల తెల్లగా ఇంత పొడుగున మెలిచుట్టుకుని ఏమిటో కుండలో పడింది. యింకా నయం, కుండ దగ్గరకెళ్ళాను" అంది నాంచారమ్మ.

"రెండు ఝాములదాకా తిండీ తిప్పలు తినక పోతే, పైత్యించి కళ్ళు చెదిరాయేమోనే! కాక పోతే తెల్లగా కుండలో పడడమేమిటే?" అంది ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ పిన్నత్తగారు.

"అదేమిటి అత్తయ్యా! మీరుకూడ అల్లా మాట్లాడుతారు! నా కళ్ళకేం పొరకమ్మిందనుకున్నారా? నేను స్పష్టంగా చూసేను! ఏమి సందేహం లేదు. అది నిశ్చయంగా పాము. మెలిచుట్టుకుని గోధుమవన్నె రంగుగా జారి కుండలో పడింది. యింత మధ్యాహ్నంవేళ మీతో పరిహాసమాడాల్సిన ఖర్మమేం వచ్చిందత్తయ్యా! మూరెడు పైగా ఉంది పాము. నా కళ్ళకు బాగా కనబడింది" అంది నాంచారమ్మ.

శంకరశాస్త్రి తల కొంచెం ఏటవాలుగా వంచి, ముక్కద్దాల సందుల్లోంచి చూస్తూ "ఏమిటీ! పామా! కళ్ళకు ఎప్పుడూ భ్రమే! వెర్రిభ్రమ. అఘోరించావుగాని ఆ కుండ యిటు తీసుకురా" అన్నాడు.

# ఆనందవాణి
## పోస్టుబాక్సు నెంబరు
# 1583

చందాదారులు, వ్యాసకర్తలు, ఏజెంట్లు తాము ఆనందవాణికి వ్రాసే ఉత్తరాల చిరునామాలో పై నెంబరును తప్పక ఉదాహరించవలెను. లేనిచో మాకు ఆ జాబులు చేరడంలో ఆలస్యం జరగవచ్చు.

—మేనేజరు


"ఏమిటండీ! గోడంతా మరీ చాదస్తం! మతి పోతోందా ఏం? చెప్తున్నా వినేరూ... నేను కుండ దగ్గరకెళ్ళేసరికి ఎలుకా ఈ పామూ, రెండూ ఉట్టి త్రాళ్ళమీద పెనుగులాడుకుంటున్నట్టున్నాయి. ఈ పాము ఎలుకను పట్టుకుందో, ఏం ఖర్మమో! అది వదిలించుకోటానికి తికమకపడుతోంది. నన్ను చూట్టంతోటే పట్టు తప్పింది కాబోలు, పాము చుట్ట చుట్టుకుని ఉన్నదున్నట్టుగా జారి కుండలో పడింది. ఎలుకకేమో అటుకే మీదకు పోయింది" అంటూ నాంచారమ్మ మాటల కనుగుణ్యంగా అర్థం స్ఫురించేట్టు చేతులు త్రిప్పుతూ చెప్పింది.

"శంకరశాస్త్రికి నవ్వొచ్చింది" అదా అసలు విషయం! చెప్పవేం! ఎలుకకూడానా! దాని తోక ఎంత పొడుగుంది! మొన్నీమధ్య గోడకు సున్నం కొడుతూంటే, సున్నపుగుడ్డ ఉట్టి త్రాటి కంటుకొని వేలబడింది. ఆ త్రాటిమీదకు ఎలుక వస్తే, దాని తోకరంగూ, త్రాటి తెలుపురంగూ కలిసి, గోధుమవన్నెగా కనుపించింది, ఆ మతిభ్రమతో పాటు. చుట్టలు చుట్టుకొన్నట్టూ, మెలి పడ్డట్టూ, కుండలో పడ్డట్టూ కనిపించుంటుంది.

మజ్జిగకుండ అంచులు నాకుదాకున్న వచ్చిన ఎలుక నిన్ను చూట్టంతోటే పారిపోయుంటుంది. ఇంతేనా?" అనేసరికి పిన్నత్తగారు ఫక్కున నవ్వింది. నాంచారమ్మ కూడా కొంచెంగా నవ్వుముఖం పెట్టింది.

కాని యింతలో మజ్జిగకుండలో ఏదో "టప, టప"మని కొట్టుకున్నట్లుగా వినిపించింది శాస్త్రికి. దాంతో శంకరశాస్త్రి గుండెలు "దడదడ"మన్నాయి. పళ్ళు బిగపట్టి ఆత్రంతో "ముందు కుండమీద మూత పెట్టండర్రా!" అంటూ మజ్జిగ లేకుండానే దొడ్లోకెళ్ళాడు చెయ్యి కడుక్కోటానికి.

నాంచారమ్మకూ ఆవిడ పిన్నత్తగారికీ ఉట్టి దగ్గరకెళ్ళటానికే భయమేసింది. అందువల్ల శంకరశాస్త్రి ఒక చిన్న పళ్ళెం తీసుకుని నెమ్మదిగా అంగలు వేసుకుంటూ వెళ్ళి ఉట్టికి రెండు గజాల దూరంలో నుంచునే ఒక కాలు బాగా ముందుకు వేసి, రెండు వ్రేళ్ళతోనూ పళ్ళెం పుచ్చుకుని, రొమ్ము వెనక్కు విరచుకుంటూ చెయ్యి చాపి కుండమీద మూత వేశాడు.

యింకే ఆ పామును చంపాలి. ఎట్లా? ఏమైనా విషజంతువు తను ఒక్కడివల్ల అయ్యేపని కాదనుకొని ఎవరినైనా పిలుచుకు రావటానికి బైట కెళ్ళాడు శాస్త్రి.

"ఇదేమిటే అమ్మాయీ! ఈ రెండు ఝాముల వేళ పాము రావటం! మనింట్లో ఎన్నడూ లేదు" అంది పిన్నత్తగారు.

ఇంతలో క్రిందటిరోజున నాగులచవితి అన్న విషయం జ్ఞాపకం వచ్చింది నాంచారమ్మకు. ఆ రోజే ముట్టుస్నానకారణంగా పుట్టలో పాలు పోసుకోలేదని ఫలితమే యిదంతా ననుకుంది. "ఎంత పాపిష్టిదాన్నత్తయ్యా! వెధవముట్టు, యింకో మూడు రోజులు ముందుగానైనా వచ్చింది కాదు. సరిగ్గా చవితినాటికే స్నానం, ముట్టుస్నానంతో ఉపవాసమేమిటన్ని తిండికూడ తిన్నాను దిక్కుమాలినదాన్ని. అందుకనే ఆ నాగేంద్రస్వామికి కోపంవచ్చి, నన్ను పరీక్షించటానికే స్వయంగా యింత ఎండవేళ నా యింటికొచ్చాడు' అని భయంతో, దుఃఖంతోనూ కళ్ళనీళ్ళు కారుస్తూ చెప్పింది నాంచారమ్మ.

"అల్లా ఏమీ అనుకోకే అమ్మాయీ! నీ పేరుమీదుగా ఇన్ని పాలు, వడపప్పు పోసిచ్చొచ్చాను

కాదే" ఎందుకు రావాల్సొచ్చిందో వచ్చింది. అంతే నువ్వేమీ దిగులు పడకు" అని సమాధాన పర్చింది పిన్నత్తగారు.

"నువ్విచ్చొస్తే సరా! అత్తయ్యా! నేనే స్వయంగా పాలు పోయలేదని ఆ సుబ్రహ్మణ్యేశ్వరునికి ఎంత కోపంగా ఉందో! 'స్వామీ! అపచారం జరిగింది. క్షమించు! రేపే నీ పుట్టదగ్గర కొచ్చి కడుపునిండా పాలుపోసి నీ పేరుమీదుగా బ్రాహ్మడికెట్టుకుంటాను తండ్రీ!" అంటూ చేతులు జోడించి కళ్లు మూసుకుని మ్రొక్కు-కుంది.

ఈ లోగా యిద్దరిముగ్గుర్ని తీసుకువచ్చాడు శాస్త్రి. ఒక్కొక్కళ్ళూ పెద్దపెద్ద కర్రలు పుచ్చుకొచ్చారు.

వాళ్ళను చూచేసరికి వడలిపోయింది నాంచారమ్మ. ఆ పామును చంపుతే తనూ, తన పిల్లలూ అంతా నాశనమే ననుకుంది. నెమ్మదిగా శంకర శాస్త్రి దగ్గరకెళ్ళింది. ఆ పామును చంపిస్తారా ఏమిటండీ! అసలు యిదంతా యిల్లా ఎందుకు జరుగుతోందో. ఊహించారా! నిన్న పుట్టలో పాలు పోయకపోతే ఆ నాగేంద్రస్వామి స్వయంగా మనను పరీక్షించటాని కొచ్చాడు. మీరింత పనిచేస్తే మనకింక పుట్టగతులుంటాయా?" అనేసరికి శంకరశాస్త్రికి చిరాకెక్కింది. ఉండవే! తెల్లారి లేచినప్పటినుంచీ మళ్ళీ పడుకో బోయేదాకా దేవుడూ, దైవమూ! ఎలుక కనిపిస్తే విఘ్నేశ్వరుడు, తేలు కనిపిస్తే పోలేరమ్మ! ఛస్తున్నాం నీ చాదస్తంతో. ఒకప్రక్క విష జంతువు నింట్లో పెట్టుకుని చంపొద్దంటావూ! గూట్లో పెట్టి పూజిస్తా? ఫో! ఫో!" అంటూ విదిలించి కొట్టాడు.

ఇంక తనమాట సెగ్గదనుకుని ఆ సుబ్రహ్మణ్యేశ్వరుని ప్రార్థించుకుంటూ ఒకమూల కూర్చుంది నాంచారమ్మ.

ఇంక ఆ కుండను బైటకు చేర్పించాలి. [illegible]దట్లో వచ్చినవాళ్ళతోనే తీయిద్దామనుకున్నాడు కాని, వంటిల్లు మైలపడిపోతుందనే ఉద్దేశ్యంతో, లోపల భయంగా ఉన్నా, తనే స్వయంగా నడుము బిగించి వణుకుతూన్న చేతుల్తో మూతతో సహా కుండను గట్టిగా పుచ్చుకుని గబగబా నడివీధిలోకి తీసుకువచ్చి రోడ్డుమధ్యన పెట్టాడు.



ఈ గల్లంతు చూచి యింకో రెండుమూడు యిళ్ళ వాళ్ళుకూడ కర్రలు తీసుకువచ్చారు.

నాంచారమ్మ మాత్రం యిదంతా చూస్తే ఎక్కడ పాపమొస్తుందోనని, వంటింట్లో దేవతార్చన గూటిముందు కూర్చుని అనేకరకాలుగా ఊహాలు చేస్తూ, రాబోయే విపత్తునుండి కాపాడమని, దేవుణ్ణిగురించీ, నాగేంద్రుణ్ణీ ప్రార్థిస్తోంది.

పిన్నత్తగారు ఎటూ మాట్లాడలేక గడపనానుకుని గుడ్లప్పచెప్పి చూస్తూ నుంచుంది.

శంకరశాస్త్రికూడ పొడుంకర్ర పుచ్చుకుని చెమటలు తుడుచుకుంటూ జనం చుట్టూ తిరుగుతూ ఏదో మాట్లాడుతున్నాడు.

ఇంతలో దండమీద పళ్ళెం ఎగరగొట్టారు ఎవరో. మజ్జిగనీళ్ళమీద కుండలో ఏదో తేలుతున్నట్టుగా పొడుగ్గా కనుపించింది. ఒకాయన కుండను బోర్లించాడు. అంతకుముందే కర్రలెత్తి పుచ్చుకున్నవాళ్ళంతా "టపటప"మని బాదారు.

శంకరశాస్త్రికూడ కర్రెత్తి కుండమీద బాదాడు. ఆ బాదటంలో మజ్జిగ చింది, శాస్త్రి మొహం మీద పడింది. తొల్లాయితో ముఖం తుడుచుకుని చూచేసరికల్లా అందరూ కర్రలు దించేసి మొఖాలు వేలవేసి చూట్టం మొదలెట్టారు. యోధుల ముఖాలు పాండురోగి ముఖాల్లాగ తెల్లబడ్డాయి. మజ్జిగఅంతా బూడిదలో యింకిపోయింది. ఎక్కడా తెగకుండా కాయంతా గుండ్రంగా పొడుగ్గా తరిగిన దోసకాయ తొక్కమాత్రం బైటపడింది.

"ఇదేమిట్రా! ఈ దోసకాయతొక్క" అన్నాడు శంకరశాస్త్రి నోరుతెరచుకుని, చూడవచ్చినవాళ్లు నవ్వాపలేక మెలితిరిగిపోతున్నారు.

"చాల్లేవయ్యా! శాస్త్రిలూ, మహా తెలివితేటలు సంపాదించావు! ఇంతమందిని పిలిచి, ఇంత ఎండవేళ ఇంత నాటకమాడిస్తావుటయ్యా!" అని ఊరిమాడు కర్రలుచ్చుకున్నవాళ్ళంతా.

శాస్త్రికి ముచ్చెమటలు పోశాయి. "లేదు బాబూ! లేదు! ఇదంతా ఆడవాళ్ల భ్రమ, నిజమేననుకున్నాను. మరేమనుకోకండేం?" అంటూ వాళ్ళను సర్దిపంపాడు. ఈ చివాట్లు, ఆక్రోశం, అంతా ఒక్కసారిగా నాంచారమ్మమీదకు మళ్ళింది శాస్త్రికి.

ఈ విషయం తెలుసునని ముందుగానే చేటంత ముఖం చేసుకుని, చెవులమధ్యలోకి ముసుగుని ఎగలాక్కుంటూ పిన్నత్తగారు అడుగులు తడబడుతూ గబగబా వంటింట్లో కొచ్చింది.

ఆవిడ వెనకాలే ముఖం చిట్లించుకుంటూ శంకరశాస్త్రి పెద్దపెద్దఅంగలు వేసుకుంటూ వచ్చాడు. "నేను చెప్పలేదుటే! నీ కళ్లకు ఎప్పుడూ యిలాంటి అపభ్రంశపు దృశ్యాలే కనుపిస్తూంటాయి. పాముట, పాము! నీ మొహం! తరిగి ఏ మూల పోశావో! ఏమో! దోసకాయ తొక్కలు! అవి ఎలుకలెత్తుకుపోయి ఉట్టిమీదకు తెచ్చాయి కాబోలు! తింటూ, తింటూ నిన్ను చూచేసరికి ఆ బెదురులో పళ్ళ పటుత్వం తప్పుంటుంది. అది కాస్త జారి కుండలో పడుంటుంది. అవి నీ కళ్లకు మెలి చుట్టుకున్నట్లూ, గోధుమవన్నెరంగుతో నాగేంద్రస్వామైపోయాడు. ఉట్టిమీద కుండబెట్టినపుడు మూతలేసుకు చావకూడదూ!" అంటూ చిందులు త్రొక్కాడు.

కళ్లు మూసుకూర్చున్న నాంచారమ్మ "దోసకాయ తొక్కేమిటండీ?" అంటూ లేచింది.

"నీ శ్రాద్ధం" అంటూ ఏమో చెప్పబోయేసరికి "ఉట్టిత్రాటిరంగూ, ఎలుకతోకరంగూ కలిసి అల్లా కనుపించింది కాదూ!" అని ముసిముసినవ్వులు నవ్వుకుంటూ పిన్నత్తగారు దెప్పిపొడిచింది.

ఇంట్లోనూ బైటకూడ తనే తల వంచుకోవాల్సొచ్చిందని శాస్త్రి నెమ్మదిగా బైటకు జారాడు.

ఆ ప్రక్కనే ఉన్న "రోలు"ప్రక్కనుంచి ఇంకో చిన్నదోసకాయ తొక్క నోట కరచుకుని ఒకసారి "కీచు" మని తోకాడించుకుంటూ "తుర్రు" మని తలుపుమీదుగా చూర్లోకి పోయింది ఒకఎలుక.

ఎలుక పోతూన్నవేపు ఒకసారి, పిన్నత్తగారి ముఖం ఒకసారి నాంచారమ్మ నవ్వుకుంటూ దొడ్లోకి పోయింది.

ANANDAVANI is printed by V. AZIZULLA at Deccan Times Press Madras
and published by V. KALIDAS, at 12 Thambu Chetty Street, Madras.
Editor: V. KALIDAS, Associate Editors : Andra Seshagiri Rao B.A. Mudda Viswanadham